# గానము చేయువారు

# (5:19, 20)

నేను ప్రాథమిక పాఠశాలలో న్యూ మెక్సికో కొండలలో యింటినుండి దూరంగా క్యాంపులో ఉన్నాను. అది బహు చలిగా, తేటగా ఉన్న రాత్రి – నాకు యింకా జ్ఞాపకం ఉంది. సూర్యుడు అస్తమించినతోడనే చాలా చీకటియైపోతుంది. సన్నని యిరుకైన దారిలోగుండా వెళ్లడానికి మేము చేతిలైట్లు వాడుతూ ఉండేవారం. అడవిలోగుండా వేళ్లే మా ప్రయాణం ముగిసిన వెంటనే మమ్మును నడిపించేవారు చలిమంట వేశారు. మేమందరం దాని చుట్టు కూర్చుండి, మంటలోనుండి నిప్పురవ్వలు లేస్తూ కొంచెంసేపు ఎగిరి పొగలో మాయమైపోతూ ఉండేవి. నేను ఆకాశంవైపు తేరి చూచి, అంతకు ముందు నేనెన్నడు గుర్తించనన్ని ఎక్కువ నక్షత్రాలను చూడగలిగాను. మరియు ప్రక్కనే ఓ చిన్న సెలయేరు గలగలలాడుతూ ఉంది. దేవదారు వృక్షాల పరిమళం గాలిని నింపుతుంది. ఆ రాత్రి మేము పాడిన పాటను నేను యింకా జ్ఞాపకం చేసుకోగలను:

> ఓ ప్రభువా నా దేవా! నేను భక్తిపూర్వకమైన ఆశ్చర్యంలో ఉన్నప్పుడు
> నీ చేతులు చేసిన లోకాలన్నిటిని నేను ఆలోచించి,
> నక్షత్రాలను చూస్తున్న, పొర్లి వస్తున్న ఉరుమును వింటున్నా,
> విశ్వమంతటిలో నీ శక్తి ప్రదర్శింపబడుతుంది,
>
> అప్పుడు నా ఆత్మ పాడుతుంది, నా రక్షకుడగు దేవా నీకే;
> నీవు ఎంత గొప్పవాడవు, నీవు ఎంత గొప్పవాడవు![1]

ఆ రాత్రి ఆ పాట నాలో ప్రవహిస్తుండగా నన్ను గూర్చి నేను ఆలోచించుకున్న సంగతి నాకు యింకా జ్ఞాపకముంది. "నా మనోభావం యింటిలో ఉన్నట్టే ఉంది." మిడ్‌లాండ్ టెక్సాసునుండి ఉత్తరపు న్యూ మెక్సికో చీకటి పర్వతాలవరకు ఎన్నో మైళ్లదూరం ఉంటుంది. నా చిన్ననాటి దృశ్యాలు ఎరుకైన శబ్దాలనుండి బహు దూరంగా ఉన్నాను. అయినా, నాలో ఆ భావం – నిజంగా నేనైయున్న భాగాన్ని, నా హృదయంలో యింకా ఎరుగుదును – ఎలాగో ఆ పాట పాడుతుండగా నేను యింటివద్ద ఉన్నట్టే అనిపించింది.

శారా అనే నా కుమార్తె ఎక్కువ మంది నవ యౌవన బాలికలవలెనే ఉంటుంది. తన్ను తాను లోకం ముందు ఎలా ఉంచుకోబోతుందో ఉదయం ఆమె సిద్ధపడుతుంది. ఒక ఉదయం నేను ఉదయ కాలపు భోజనం చేస్తూ ఉండగా, శారా తల దువ్వుకొంటుంది. హెయిర్ డ్రయర్ శబ్దం చేస్తుంది, కాని మరో శబ్దం నన్ను ఆపింది, నేను ఆలకిస్తున్నా. అది బహు తేటైన స్వరం – అది దేవునికి తెరువబడిన హృదయం. నా కుమార్తె ఈ

మాటలు పాడుతుంది. “యేసూ, నీవు దేవుని గొర్రె పిల్లవు. నీ నామము యోగ్యమయ్యింది.”

నేను నా కుమార్తె యొక్క పాటనాలకించి, “ఇది యింటిలా అనుభూతి కలిగిస్తుంది” అని నేను ఆలోచించాను. నేను మా వంట గదిలో కూర్చుండినందుకు గాని లేదా, నా కుటుంబమంతా నాతో ఉన్నందుకుగాని నాకు ఆ అనుభూతి కలుగలేదు. అది ఆ పాటకు సంబంధించింది – దేవునికి తెరువబడిన హృదయంలోనుండి పొర్లి పారుతున్న సంగీతంతో సంబంధించినది.

చాల కాలం క్రిందట, రాత్రి చాల ప్రొద్దుపోయిన తరువాత, యిద్దరు మనుష్యులు ఒక చెరసాల గదిలో ఉన్నారు. ఆ పగటివేళ వారి శత్రువులు వారిపై అబద్ధాలు మోపి, బాగా కొట్టారు. ఆ మనుష్యులు ఆకలితో, దప్పికతో మిగిలిపోయారు. అది మధ్య రాత్రియైనా, వారు ఎంతగా బాధపరచబడ్డారంటే, నిద్రపోలేకపోయారు. అపొస్తలుల కార్యాల్లో ఈ మనుష్యులను గూర్చి మనం చదువుతాం. “అయితే మధ్యరాత్రివేళ పౌలును సీలయు దేవునికి ప్రార్థించుచు కీర్తనలు పాడుచునుండిరి; ఖయిదీలు వినుచుండిరి” (అపొ. 16:25). వారి బాధలోను, పరితాపకరమైన పరిస్థితులలోను వారు పాటలు పాడుతున్నారు. వారు దేవుని స్తుతించుతున్నారు. ఖయిదీలు ఆలకించుతూ, చీకటి చెరసాలలో అలాటి సంతోషం ఎలా కలుగుతుందా అని ఆశ్చర్యపోతున్నారు. పౌలు సీలలను గూర్చి నేను చదివి యిలా ఆలోచిస్తాను: “ఆ రాత్రి వారు యింటివద్ద ఉన్నారు – దేవునికి కీర్తనలు అర్పించడంలో యింటనున్నారు.”

దేవుని వాక్యాన్ని మనం చదివినప్పుడు, దేవునికి పాడుటలో సహజంగా ఉండడం అనేది అర్థ సహితమైయుంటుంది: “మరియు మద్యముతో మత్తులైయుండకుడి, దానిలో దుర్వ్యాపారము కలదు; అయితే **ఆత్మ** పూర్ణులైయుండుడి” (5:18). క్రైస్తవులు దేవునికి తెరువబడిన (హృదయాలు గలవారై) లోబడినప్పుడు, పరిశుద్ధాత్మ మనలను నింపుతాడు. ఆయన ప్రసన్నత మనలను బలపరచి రూపాంతరం చెందిస్తుంటాడు. అదియే పరిశుద్ధాత్మ మనలో నివసించడం అంటే.

ఆయన అంతరంగంలో నివసించడంవలన కలిగే స్పృశించగల ఫలితమేది? ఒక విదితమైన ఫలితమేమంటే – హృదయంలోనుండి ప్రభువునకు గానం చేయడం. పౌలు యిలా వ్రాస్తున్నాడు,

> మరియు మద్యముతో మత్తులైయుండకుడి, దానిలో దుర్వ్యాపారము కలదు; అయితే **ఆత్మ** పూర్ణులైయుండుడి. ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువునుగూర్చి పాడుచు కీర్తించుచు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట సమస్తమునుగూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు ... (5:18-20).

“ఆత్మతో నింపబడడం” అంటే (సంగీతము చేయువారు) గానం చేయువారవ్వడం – దేవునికి పాటలు అర్పించడంలో యిష్టపూర్వకంగా సమర్పించువారై ఉండడం.

ఎఫెసీ. 5:19, 20 పాడుటను గూర్చి మాట్లాడుతుంది. పాటలో ఆరాధించడం అనే విషయాన్ని గూర్చి సాధారణమైన రూపంలో ఈ వచనాలు ఏమి చెప్పుతున్నాయో చూడు.

## పాటలో ఆరాధించడం

పాటలో ఆరాధించడం **ఆత్మసంబంధమైనది**. దేవుని ఆత్మ అంతరంగంలో నివసించ డానికి ప్రతిఫలంగా అది వస్తుంది. దేవుని ఆత్మ మన ఆత్మలను తాకినదానికి ఫలితంగా అది వస్తుంది. పాటలు పాడడం సంగీత సంబంధమైన సిద్ధాంతం తెలిసి ఉండడం మీద ఆధారపడియుండదు. గాని, లయ, తాళం అనేవాటిని ఎరిగి ఉండడంగాని అవసరముండదు. దేవుని ఆత్మ మనలో పని చేస్తున్నందున పాటలో ఆరాధన జరుగుతుంది.

పాటలో ఆరాధన **భావపూరితమైనదై కూడా ఉంటుంది**. పాడుచు, మన హృదయంలో ప్రభువునకు గానం చేస్తూ ఉండుడని బైబిలు మనకు తెలుపుతుంది. మనం పాడేటప్పుడు, మన భావోద్రేకాలు అందులో ఉండనప్పుడు, ఏదో తప్పయి ఉండాలి. పాటలో ఆరాధన కేవలం వివేకపు అనుభవం కంటె మించినదైయుండాలి. అతి బలీయమైన మన ఉద్రేకాలను అది పనిలో పెడుతుంది.

పాటలో ఆరాధన **ఆనందదాయకమైనది**. ఆనందము, ఉత్సాహము, కొనియాడడం అనేవాటిని చవి చూడకుండ ఎఫెసీ. 5లోని పౌలు మాటలను మనం చదువలేం. కీర్తన. 145:7 యిలా అంటుంది: “నీ మహా దయాళుత్వమును గూర్చిన కీర్తిని వారు ప్రకటించెదరు నీ నీతినిగూర్చి వారు గానము చేసెదరు.”

క్రీస్తునందు మనం కొనియాడవలసింది ఎంతో ఉంది! తప్పిపోయిన కుమారుని ఉపమానంలో ఆయన ఈ విషయాన్ని బోధించాడు. తప్పిపోయిన కుమారుడు యింటికి తిరిగి వచ్చినప్పుడు అంతటి వైభవంతో కూడిన ఉత్సాహాన్ని ఎందుకు జరుపుతున్నాడో తండ్రి తన పెద్ద కుమారునికి వివరించాడు: “అందుకతడు–కుమారుడా, నీవెల్లప్పుడు నాతోకూడ ఉన్నావు; నావన్నియు నీవి; మనము సంతోషపడి ఆనందించుట యుక్తమే; ఈ నీ తమ్ముడు చనిపోయి తిరిగి బ్రదికెను, తప్పిపోయి దొరికెను” (లూకా 15:31, 32).

భీకరుడగు గొప్ప దేవుని యెదుట మన ఉత్సాహము భయభక్తులతోను, వినయంతోను కూడినదైయుండాలి. ఏదియెలాగున్నా, భయభక్తులనేవి ఉత్సాహాన్ని నిరాకరించేదానితో సమానంగా ఎంచకూడదు. మన దేవుడు సజీవుడైయున్నాడు! మన ప్రభువు తన సంఘంలో నివసించువాడైయున్నాడు! పరిశుద్ధాత్మ మన జీవితాలను నింపువాడైయున్నాడు! మనము సంతోషించి ఆనందింతుము. పాటలో ఆరాధన ఆనంద దాయకమయ్యింది.

పాటలో ఆరాధన **వ్యక్తపరచునదైయుంది**. అది దేవుని ఘనపరచుతుంది. మన పాటలు దేవునికి యోగ్యతను ఆరోపిస్తాయి. మన ఆత్మలు ఆయన **ఆత్మ** చేరువకు వెళ్లతాయి.

పాటలో ఆరాధన సంఘ **ప్రజలతో కూడినదైయుంది**. “ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు” దానిని యితర క్రైస్తవులతో పంచుకునే భాగ్యం మనకు లభిస్తుంది. ఒంటరిగా పాడేటప్పుడు జరుగనిది ఒకటిగా కలిసి పాడేటప్పుడు సంభవిస్తుంది. నా ఉదయ కాల భక్తి సమయాల్లో ప్రభువుతో నేనొక్కడినే పాడుకుంటాను. “నేను నిన్ను ప్రేమిస్తున్నాను, ప్రభువా,” అని నేను పాడవచ్చు. అందులో నాయంతట నేను కొంత దేవునికి వ్యక్తపరచుకుంటాను. నేను పాడడంలో నాతోటి క్రైస్తవులతో జతకూడినప్పుడు, పాట నూతన పరిమాణాన్ని పుంజుకొంటుంది.

నా సొంత లోకంకంటె పెద్దదానిలో నేను భాగమైయున్నట్టు అది స్థిరపరచుతుంది. నాకున్న విశ్వాసాన్ని పంచుకునే క్రైస్తవుల సహవాసంలో నేను ఒకడనైయుంటాను లేక దానికి చెందినవాడనై యుంటాను.

చివరిగా, పాటలో ఆరాధన **కృతజ్ఞతతో కూడినదైయుంది.** సులభంగా కోపం చెందే, వ్యతిరేక తత్వంగల వ్యక్తి పాడనిష్టపడకపోవచ్చు. మన హృదయాలు మార్పు చెందునంతగా దేవుని ఆత్మ మన అంతరంగములోనికి చొచ్చినప్పుడు, ఆనందము, కృతజ్ఞతతోకూడిన పాటలు సహజ ప్రతిఫలమౌతాయి.

పాటలో ఆరాధనను గూర్చి పౌలు మాటలు ఉపదేశిస్తున్నాయి. పాటలో ఆరాధనను గూర్చి వారినీ నిన్నూ ఆలోచించు. "ఆత్మ సంబంధమైన," "ఉద్రేకమైన," "ఆనంద దాయకమైన," "వ్యక్తపరచునదైన," "కృతజ్ఞతతో" అనే పదాలు పాటలో నీ ఆరాధనను వివరిస్తున్నాయి. వివరించాలి కూడ.

## ఆత్మతో నింపబడిన హృదయాలనుండి ఆరాధన

పాటలో మనం ఆరాధిస్తుండగా ఆత్మతో నింపబడినదానికి కలిగే కొన్ని ప్రత్యేకమైన ఫలితాలను గమనించు. **మొదట, అది యితరులకు సేవ చేయడంలో ఫలిస్తుంది.** 19ఎ వ. యిలా అంటుంది: "ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు." క్రైస్తవులు దీవులవలె ఉండిపోరు. నీవు నాకు అవసరం, నేను నీకు అవసరం. పాటలో మనం పాలుపుచ్చుకొనడం ఈ విషయాన్ని గుర్తు చేస్తుంది. మన స్వరాలను ఏకం చేయడం, ఒకవిధంగా నీవు నాకు సేవ చేస్తావు నేను నీకు సేవ చేస్తాను. నీ విశ్వాసాన్ని వ్యక్తపరచేవాటిలో నేను నీతో జతకూడతాను. నా హృదయం దేవునికి పంపనుద్దేశించిన సందేశంలో పాట ద్వారా నీవు నాతో కలిసి పోతావు. తన్ను ఖాళీ చేసికొంటూ యితరులకు పరిచర్య చేయడమే ప్రభువు యొక్క సేవలో అది ఒకరికొరకు ఒకరం చేస్తాం.

**రెండవది, అది ప్రభువైన యేసును ఆరాధించేదిగా ప్రతిఫలిస్తుంది.** 19బి వ. యిలా అంటుంది: "మీ హృదయములలో ప్రభువునుగూర్చి పాడుచు కీర్తించుచు" (ఒత్తి పలకడం నాది). మనం పాడుటలో మనకు సమతుల్య తూకం కావాలి. కొన్ని పాటల్లోని మాటలు, భావాలు మనచుట్టునున్న వారివైపు మరల్చబడినవై ఉంటాయి. "కోపపు పలుకులు! కళ్ళెం పెట్టని నోటినుండి జారనివ్వకు" అనే మాటలు మనం దేవునికి పాడేవి కాదు. అవి మనం ఒకరికొకరం పాడుకుంటాం. అలా చేయాలని దేవుడు మనలను కోరుతున్నాడు. అయితే, "నీవు నాకు అనుక్షణం కావాలి" మరియు "వంచబడిన మోకాళ్లపై" వంటి కీర్తనలు కూడా మనకు కావాలి. వాటితో మన హృదయాలలో ప్రభువునకు గానం చేస్తాం.

**మూడవది, ప్రతి విషయంలోను దేవునికి కృతజ్ఞతాస్తుతులు చెల్లించడంలో అది ఫలిస్తుంది.** 20వ వచనం యిలా అంటుంది: "తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుచు ..." కృతజ్ఞతాస్తుతులను గూర్చి మేక్స్ యాండెర్స్ యిలా అన్నాడు:

మన దైనిక జీవితం జీవించ వెళ్లినప్పుడు మన జీవితాలు ఎంతటి అపాయకరమైన స్థితిలో వ్రేలాడతాయో మనం గ్రహించినట్టయితే ... మన చుట్టునున్న ఆత్మ సంబంధమైన పోరు ఎంత శక్తివంతమయ్యిందో మనం ఎరిగియుంటే, మన బల్లమీద భోజనం మన తలమీద కప్పు ఉండడం ఎంత అదృష్టమో తెలిసికొనియుంటే ... మన జీవిత అవసరాలకు సాధారణమైన దేవుని కృపమీదను, యితరుల మంచితనంమీదను ఎంతగా ఆధారపడి ఉంటుందో గ్రహించియుంటే – మనం కృతజ్ఞతగల జనులమైయుంటాం. మనకు లేనివాటి విషయంలో కృతజ్ఞత లేనివారమై ఉండడం కంటె మనకు కలిగియున్న దానికి కృతజ్ఞత గలవారమైయుండాలి.[2]

నీ జీవితం యొక్క భావాన్ని నీవు ఎలా వర్ణించుతావు? నీవు గొణిగేవాడివా లేక గానం చేసేవాడివా? ఆరాధన కార్యక్రమంలో దేవుని గూర్చియైన ఫిర్యాదు చేసేవాడివా లేక సహోదర సహోదరీలతో పాటలో పాలుపొందువాడవా? నీ హృదయం ప్రేమలేక ముడుచుకొనిపోయిందా లేక ప్రభువునకు గానం చేయడంలో ప్రేమతో ఉప్పొంగుతుందా?

## ముగింపు

"ఆత్మ పూర్ణులైయుండుడి. ఒకనినొకడు కీర్తనలతోను సంగీతములతోను ఆత్మ సంబంధమైన పాటలతోను హెచ్చరించుచు, మీ హృదయములలో ప్రభువును గూర్చి పాడుచు కీర్తించుచు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట సమస్తమును గూర్చి తండ్రియైన దేవునికి ఎల్లప్పుడును కృతజ్ఞతాస్తుతులు చెల్లించుడి." ఆత్మతో నింపబడిన హృదయాల్లో నుండి మన సంగీతం రానియ్యండి. ఇతరులతో మన విశ్వాసాన్ని పంచుకునే పాటలు పాడండి. సంగీత గానంతో మన హృదయాలను దేవుని సన్నిధికి తెచ్చి, మనం యింటి వద్ద ఉన్న భావనను కలిగించుదాం.

సూచనలు

[1]Carl Boberg, "How Great Thou Art," trans. Stuart K. Hine. This quotation is used by permission of ACU Press. [2]Max Anders, *The Good Life: Living With Meaning in a "Never-Enough" World* (Dallas: Word Publishing, 1993), 167.